సాక్షి
మంచిర్యాల

గురువారం । 13 । మార్చి । 2025


మోదుగు పూలతో రంగులు తయారు చేస్తున్న విద్యార్థులు

'సహజ' హోలీ.. సంతోషాల కేళి

దండేపల్లి: హోలీ పండుగ అంటే చిన్నారులు, పెద్దలు అందరికీ రంగుల సంబరమే. రసాయన రంగులు వాడకుండా సహజ రంగుల వినియోగం వల్ల ఆరోగ్యం.. ఆనందం. దండేపల్లి మండలం గుడిరేవు ప్రాథమిక పాఠశాలలో బుధవారం మోదుగు పూలతో సహజంగా రంగు తయారీపై హెచ్‌ఎం, ఉపాధ్యాయులు విద్యార్థులకు వివరించారు.

- ప్రత్యేక కథనం.. 8లో▸

న్యూస్‌రీల్

మిషన్ భగీరథ నీరందించేలా చర్యలు


కాలనీలో మాట్లాడుతున్న డీఈ విద్యాసాగర్

సాక్షి ఎఫెక్ట్..

చెన్నూర్‌రూరల్: 'బావురు మంటోన్న బావురావుపేట' శీర్షికన 'సాక్షి'లో బుధవారం ప్రచురితమైన కథనానికి ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు స్పందించారు. బుధవారం మండలంలోని బావురావుపేట గ్రామంలో ఎస్టీ కాలనీని సందర్శించారు. కాలనీలో నెలకొన్న తాగునీటి సమస్యపై అడిగి తెలుసుకున్నారు. ఇక నుంచి మిషన్ భగీరథ నీరు రెండు పూటల సరఫరా అయ్యేలా చర్యలు తీసుకుంటామని డీఈ విద్యాసాగర్ తెలిపారు. ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ సరిత, పంచాయతీ కార్యదర్శి రమణ పాల్గొన్నారు. సమస్యను అధికారుల దృష్టికి తీసుకెళ్లిన 'సాక్షి'కి గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు.

సింగరేణి కార్మికుల పింఛన్ పెంచాలి


ఎంపీ గడ్డం వంశీకృష్ణ


శ్రీరాంపూర్: బొగ్గుగని రిటైర్డు కార్మికులకు ఇప్పుడిస్తున్న పింఛన్ ఏమాత్రం సరిపోవడం లేదని, పెంచాలని పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ లోకసభ దృష్టికి తీసుకెళ్లారు. బుధవారం ఆయన ప్రశ్నోత్తరాల సమయంలో రిటైర్డు కార్మికుల పింఛన్ సమస్యపై మాట్లాడారు. 35ఏళ్ల క్రితం కాక వెంకటస్వామి బొగ్గుగని కార్మికులకు పింఛన్ హక్కు కల్పించారని, అప్పటి నుంచి పెంచలేదని, రూ.1500 మాత్రమే ఇప్పటికీ పొందుతున్నారని అన్నారు. సింగరేణి కార్మికులు తెలంగాణ కోసం కొట్లాడారని, దేశం కోసం వెలుగు ఇస్తున్న కార్మికుల జీవితం ఉద్యోగ విరమణ తర్వాత చీకట్లో మగ్గుతోందని తెలిపారు. దశాబ్దాల క్రితం నిర్ణయించిన పింఛన్ ఇప్పుడెలా సరిపోతుందని, వారికి న్యాయం చేయాలని ప్రభుత్వాన్ని కోరారు.

ట్రాఫిక్ సమస్య పరిష్కారానికి చర్యలు


రికార్డులు పరిశీలిస్తున్న డీసీపీ భాస్కర్

బెల్లంపల్లి: బెల్లంపల్లిలో ట్రాఫిక్ సమస్య పరిష్కారానికి తక్షణ చర్యలు చేపట్టనున్నట్లు డీసీపీ ఏ.భాస్కర్ తెలిపారు. బుధవారం సాయంత్రం పట్టణంలోని మెయిన్ బజార్, అంబేడ్కర్ చౌరస్తా ప్రాంతాలను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చౌరస్తాతోపాటు మెయిన్ రోడ్డు, ముఖ్య కూడళ్లలో ప్రధాన రహదారిపై వాహనాలు పార్కింగ్ చేయరాదని అన్నారు. ప్రధాన రహదారికి ఇరువైపులా ఐదు మీటర్ల దూరం వరకు ఎలాంటి వాహనాలు పార్కింగ్ చేయకుండా చూడాలని వన్‌టౌన్ ఎస్‌హెచ్‌వో దేవయ్యను ఆదేశించారు. అనంతరం వన్‌టౌన్, టూటౌన్ పోలీసుస్టేషన్లను సందర్శించి రికార్డులు పరిశీలించారు. బెల్లంపల్లి ఏసీపీ ఏ.రవికుమార్, వన్‌టౌన్ ఎస్సై నరేష్ తదితరులు పాల్గొన్నారు.

కోల్ కంట్రోల్ అధికారుల తనిఖీ


ఆర్కే 8 గనిని పరిశీలిస్తున్న అధికారులు

శ్రీరాంపూర్: సెంట్రల్ కోల్ కంట్రోల్ అధికారులు బుధవారం శ్రీరాంపూర్‌లో మూసివేసిన ఆర్కే8 గనిని తనిఖీ చేశారు. ఆ శాఖ నాగపూర్ రీజియన్ ఓఎస్‌డీ సందీప్ ఎస్ పరాంజపే, కొత్తగూడెం రీజియన్ ఓఎస్‌డీ డీవీ సుబ్రమణ్యం ఏరియా జీఎం ఎం.శ్రీనివాస్‌తో కలిసి గని మూసి వేసిన తర్వాత తీసుకున్న పర్యావరణ పరిరక్షణ చర్యలను ప్రత్యేకంగా తనిఖీ చేశారు. భూసార పరిరక్షణ ఏ విధంగా చేశారు, పచ్చదనం పెంపులో భాగంగా నాటిన మొక్కలు, గని మ్యాన్‌వే, ఇతర ప్రాంతాలకు ఎవరూ వెళ్లకుండా వేసిన కంచెను పరిశీలించారు. ఏరియా ఎస్‌ఓటు జీఎం యస్.సత్యనారాయణ, గ్రూప్ ఏజెంట్ కే.రాజేందర్, ఎన్విరాన్‌మెంట్ అడిషనల్ మేనేజర్ వీ.తిరుపతి, ఆర్కే 7గని మేనేజర్ ఈ.తిరుపతి, అధికారులు శేఖర్, వరలక్ష్మీ, చంద్రమణి పాల్గొన్నారు.

సర్కారు బడిలో ఏఐ బోధన


శిక్షణలో పాల్గొన్న రిసోర్సు పర్సన్లు



పైలట్ ప్రాజెక్ట్ కింద ఎంపికైన చాకెపల్లి పాఠశాల

- సులభ బోధన కోసమే వినియోగం
- జిల్లాలో ఆరు పాఠశాలల్లో అమలు
- త్వరలో ప్రారంభానికి సన్నాహాలు

మంచిర్యాలఅర్బన్: సర్కారు పాఠశాలల విద్యార్థుల్లో చిన్నప్పటి నుంచే డిజిటల్ నైపుణ్యాలను పెంచేందుకు ప్రభుత్వం ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్(కృత్రిమ మేధస్సు) బోధన అందుబాటులోకి తెస్తోంది. జిల్లాలో పైలట్ ప్రాజెక్ట్ కింద ఆరు పాఠశాలలను ఇందుకు ఎంపిక చేశారు. ఎంపికైన పాఠశాలల్లో విద్యార్థులకు ఏఐ సహకారంతో వర్చువల్ రియాలిటీ విధానంలో పాఠాలు చెప్పేలా విద్యాశాఖ కసరత్తు చేస్తోంది. విద్యార్థుల్లో కనీస అభ్యసన సామర్థ్యాల పెంపే లక్ష్యంగా ఏఐ బోధన సాగనుంది. ఎఫ్‌ఎల్‌ఎన్‌కు సాంకేతికత జోడించి విద్యార్థుల్లో స్వీయ ప్రేరణ కలిగించి అభ్యసన అనుకూల పరిస్థితి కల్పించేందుకు ఏఐ బోధన వారం చివరలో ప్రారంభించేందుకు విద్యాశాఖ సన్నాహాలు చేస్తోంది.

ఆరు పాఠశాలల్లో అమలు

విద్యార్థుల సామర్థ్యాల పెంపునకు కృతిమ మేధస్సు సహకారం తీసుకోవాలని అధికారులు నిర్ణయించి తగిన కసరత్తు పూర్తి చేశారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ బోధన అమలుకు జిల్లాలో ఆరు పాఠశాలలను పైలట్ ప్రాజెక్ట్ కింద ఎంపిక చేశారు. ఇందులో ఎంపీపీఎస్ వెంకట్రావ్‌పేట్, ఎంపీపీఎస్ రాపల్లి, ఎంపీపీఎస్ ముడిమడుగు, ఎంపీపీఎస్ ఏపీ వాడ చెన్నూర్, ఎంపీపీఎస్ దుగ్నేపల్లి, ఎంపీపీఎస్ చాకెపల్లి పాఠశాలలు ఉన్నాయి. ప్రతీ పాఠశాలకు ఐదు కంప్యూటర్లను విద్యాశాఖ అధికారులు సమకూర్చాల్సి ఉంది. విద్యార్థులు తెలుగు, ఆంగ్లం బాగా చదివి.. రాసేలా, గణిత అంశాల్లో పట్టు సాధించేందుకు కృతిమ మేధ బోధన దోహదపడనుంది. ప్రతీ పాఠశాలలో 3వ తరగతి నుంచి 5వ తరగతిలో వెనుకబడిన 10మంది విద్యార్థులను ఎంపిక చేయనున్నారు. వారంలో 80నిమిషాల పాటు కేటాయించిన టైంటేబుల్ ప్రకారం ఏఐ బోధన సాగనుంది. తెలుగు, ఆంగ్లం, గణితంపై ప్రతీ విద్యార్థి కంప్యూటర్ మీద సాధన చేయాల్సి ఉంటుంది. ప్రతీ సాధన రికార్డు కానుంది. దీంతో విద్యార్థుల ప్రగతి అంచనా వేయడం సులభతరం కానుంది. ప్రస్తుతం ఉన్న సిలబస్‌ను దృష్టిలో ఉంచుకుని కార్యక్రమాలను రూపొందిస్తారు. ప్రధాన సర్వర్ల నుంచి ఆయా స్కూళ్లకు వీటిని అనుసంధానం చేస్తారు. టీచర్ ఒక పాఠం చెప్పిన తర్వాత ఏఐ ఆధారిత ప్రశ్నలు గూగుల్ క్రోం ద్వారా విద్యార్థులకు పంపిస్తారు. వీటికి ఆన్‌లైన్‌లో సమాధానం చెప్పాల్సి ఉంటుంది. కంప్యూటర్ స్క్రీన్‌పై వచ్చే వాక్యం(సెంటెన్స్) తప్పుగా అభ్యసనం చేసినప్పుడు సరిదిద్దుకునే వీలు కలుగనుంది. దీంతో విద్యార్థులు మళ్లీ ఆ తప్పు చేయకుండా ముందుకు వెళ్లేలా భయం లేకుండా సొంతంగా నేర్చుకునేందుకు వీలవుతుంది.

రిసోర్స్ పర్సన్లకు శిక్షణ

జిల్లా నుంచి ఏఐ బోధన అమలుపై నలుగురు సభ్యులతో కూడిన బృందానికి అవగాహన కల్పించారు. బృందంలో సెక్టోరియల్ అధికారి, ఎంఈవో, స్కూల్ కాంప్లెక్స్ హెచ్‌ఎం, ఎస్జీటీలను రిసోర్స్‌పర్సన్లుగా నియమించారు. వీరందరికీ మంగళవారం హైదరాబాద్‌లో కృత్రిమ మేధపై శిక్షణ ఇచ్చారు. సాఫ్ట్‌వేర్ డౌన్‌లోడ్, అప్‌డేట్ చేయడం, కంప్యూటర్లలో పొందుపరిచిన సాఫ్ట్‌వేర్‌ను అనుసంధానం, ఏఐ బోధన సమగ్రవంతంగా అమలు, తదితర అంశాలపై శిక్షణ ఇచ్చారు. శిక్షణ పొందిన బృంద సభ్యులు జిల్లాలో ప్రయోగాత్మకంగా ఎంపిక చేసిన పాఠశాలల్లో టీచర్లకు ఎప్పటికప్పుడు సూచనలు, సలహాలు ఇస్తూ పర్యవేక్షించనున్నారు.

ఆరు పాఠశాలలు ఎంపిక

జిల్లాలో ఏఐ ఆధారిత బోధనకు పైలట్ ప్రాజెక్ట్ కింద ఆరు పాఠశాలలు ఎంపికయ్యాయి. సర్కారు బడిలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌ను వినియోగిస్తూ సులభతరంగా విద్యాబోధన చేస్తారు. కంప్యూటర్లలో పొందుపరిచిన సాఫ్ట్‌వేర్‌ను అనుసంధానం చేస్తారు. కృత్రిమ మేధస్సు సహకారంతో విద్యార్థులు చదవడం, రాయడం విధానంలో పాఠాలను మదింపు చేసి విద్యార్థులకు వివరిస్తుంది. ఏఐ బోధన అమలుపై జిల్లా నుంచి నలుగురు రిసోర్స్‌పర్సన్లు శిక్షణ కోసం హైదరాబాద్‌కు వెళ్లారు. త్వరలోనే ఎంపిక చేసిన పాఠశాలల్లో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ పాఠాలు అమలులోకి రానున్నాయి.

– యాదయ్య, జిల్లా విద్యాధికారి

కిడ్నీలు జర భద్రం..!


చెన్నూరు ఆస్పత్రిలో రోగుల వివరాలు తెలుసుకుంటున్న వైద్యులు కృపాబాయి, శ్రీనివాస్


మంచిర్యాల ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలోని డయాలసిస్ కేంద్రంలో రోగులు

- పెరుగుతున్న వ్యాధిగ్రస్తుల సంఖ్య
- ప్రభుత్వ, ప్రైవేటు డయాలసిస్ కేంద్రాలకు రోగుల తాకిడి
- నేడు వరల్డ్ కిడ్నీ డే

మంచిర్యాలటౌన్: జిల్లాలో కిడ్నీ వ్యాధిగ్రస్తుల సంఖ్య రోజు రోజుకు పెరుగుతోంది. ప్రభుత్వ, ప్రైవేటు ఆస్పత్రుల్లోని డయాలసిస్ కేంద్రాలకు రోగుల తాకిడి పెరగడం ఆందోళన కలిగిస్తోంది. శరీరంలోని మలినాలను బయటకు పంపించడంలో కిడ్నీలు కీలక పాత్ర పోషిస్తాయి. రక్తాన్ని శుద్ధి చేయడం ద్వారా ఒంట్లో పేరుకుపోయిన వ్యర్థాలను మూత్రపిండాలు ఎప్పటికప్పుడు బయటకు పంపిస్తాయి. బీపీ, ఎలక్ట్రోలైట్ స్థాయిలను నియంత్రిస్తాయి. కానీ జీవనశైలి, ఆహారపు అలవాట్లలో మార్పు డయాబెటీస్, హైబీపీ వంటి వ్యాధుల కారణంగా కిడ్నీల పనితీరు మందగిస్తుంది. దీంతో శరీరం మొత్తానికి ప్రమాదం వాటిల్లుతుంది. కిడ్నీలు పాడైతే ప్రాణాలు దక్కకుండా పోతాయి. ఎప్పటికప్పుడు పరీక్షలు చేయించుకోవడం, బీపీ, షుగర్ వంటి వాటిని అదుపులో ఉంచుకుంటే మూత్రపిండాల వ్యాధి బారిన పడకుండా ఉండవచ్చని, ప్రాథమిక దశలోనే కిడ్నీల సమస్యను గుర్తించి సరైన చికిత్స తీసుకోవాలని వైద్యులు సూచిస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా ప్రతీ రోజు 90మందికి పైగా రోగులు డయాలసిస్ చేయించుకుంటున్నారంటే వ్యాధి తీవ్రత అర్థమవుతోంది. నేడు వరల్డ్ కిడ్నీ డే సందర్భంగా ప్రత్యేక కథనం.

జిల్లాలో..

జిల్లాలోని మంచిర్యాల, బెల్లంపల్లి, చెన్నూర్ ప్రభుత్వ ఆస్పత్రుల్లోని డయాలసిస్ కేంద్రాల్లో కిడ్నీ వ్యాధిగ్రస్తులకు ఉచితంగా డయాలసిస్ చేస్తున్నారు. మంచిర్యాల ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో పది పడకలు ఉండగా రోజుకు 28మందికి, బెల్లంపల్లి ఆస్పత్రిలో ఐదు పడకలు ఉండగా ఎనిమిది మందికి, చెన్నూర్‌లో ఐదు పడకలు ఉండగా 10మందికి డయాలసిస్ చేస్తున్నారు. ఇప్పటివరకు మంచిర్యాలలో 10,330 మంది, బెల్లంపల్లిలో 7,172మంది, చెన్నూర్‌లో 3,010మంది డయాలసిస్ చేయించుకున్నారు. ప్రైవేటు ఆస్పత్రుల్లోనూ రోగుల సంఖ్య ఎక్కువగా ఉంటుంది. ఆరోగ్యశ్రీ ఉన్న వారికి ఉచితంగా డయాలసిస్ చేస్తుండగా.. ఆరోగ్యశ్రీ లేని వారు ప్రైవేటు ఆస్పత్రుల్లో నెలకు రూ.10వేల వరకు ఖర్చు చేయాల్సి వస్తోంది. పాడైన మూత్రపిండాలకు చికిత్స తీసుకున్నా పూర్తి సమర్థవంతంగా మారవు. క్రమంగా గుండెజబ్బులు, అవయవాలు దెబ్బతినడం వంటివి మొదలవుతాయి. కిడ్నీని మార్పిడికి దాతలు దొరకడం కష్టం కాగా, ఆపరేషన్ ఖర్చుతో కూడుకుని ఉంటుంది. కిడ్నీలు దెబ్బతినకుండా జాగ్రత్తలు తీసుకోవాలని వైద్యులు సూచిస్తున్నారు.

నీరు ఎక్కువగా తాగాలి



ప్రాథమిక దశలోనే కిడ్నీ సమస్యలను గుర్తించి చికిత్స తీసుకుంటే డయాలసిస్ వరకు వెళ్లే ప్రమాదం ఉండదు. ఎక్కువగా నీరు తాగుతూ నిత్యం వ్యాయామం చేస్తూ ఫిట్‌గా ఉండాలి. మంచి ఆహారం తీసుకోవడంలో భాగంగా ఆకుకూరలు, కూరగాయలు, గుడ్లు, చేపలు, చిలగడ దుంపలు, కాలిఫ్లవర్, పండ్లు ఆహారంగా తీసుకోవాలి. ధూమపానం, ఆల్కాహాల్ తాగడం, గుట్కా, కర్ర నమలడం, చుట్ట తాగడం, పెయిన్ కిల్లర్ మందులు గాని, డాక్టర్ అనుమతి లేకుండా హైడోస్ మందులు తీసుకోవద్దు. ఉప్పు తగ్గించి, తగినంత నీరు, పౌష్టికాహారం తీసుకుంటూ శరీర బరువు, గుండె పనితీరు అదుపులో ఉంచుకోవాలి. మూడు నెలలకు ఒకసారి కిడ్నీ సంబంధిత పరీక్షలు చేయించుకోవాలి.

– డాక్టర్ రాకేశ్‌కుమార్ చెన్న, నెఫ్రాలజిస్టు, మంచిర్యాల

చట్టవ్యతిరేక కార్యకలాపాలపై ఉక్కుపాదం

- ప్రజల భద్రత, బాధ్యత పోలీసులదే..
- రామగుండం పోలీస్ కమిషనర్ అంబార్ కిషోర్ ఝూ


డీసీపీ నుంచి తెలుసుకుంటున్న సీపీ అంబర్ కిషోర్ ఝూ

మంచిర్యాలక్రైం: చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడే వారు ఎంతటివారైనా ఉపేక్షించేది లేదని, అలాంటి వారిపై ఉక్కుపాదం మోపుతామని రామగుండం పోలీసు కమిషనర్ అంబర్ కిషోర్ ఝూ అన్నారు. కమిషనర్‌గా బాధ్యతలు చేపట్టిన తర్వాత మొదటిసారిగా బుధవారం మంచిర్యాల పోలీసుస్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఎలాంటి కేసులు ఎక్కువగా నమోదవుతున్నాయని, పెండింగ్ కేసులు, అధికంగా నేరాలు జరుగుతున్న తీరు, రౌడీషీటర్ల బైండోవర్, కౌన్సెలింగ్ తదితర విషయాలపై అడిగి తెలుసుకున్నారు. పెండింగ్ కేసులు, ఎఫ్‌ఐఆర్ రికార్డులు పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రజల భద్రత, బాధ్యత పోలీసులదేనని అన్నారు. ఫ్రెండ్లీ పోలీసు బాధితులకు మాత్రమేనని, నేరస్తులకు కాదని స్పష్టం చేశారు. అంతకుముందు డీసీపీ భాస్కర్, ఏసీపీ ప్రకాష్ ఆయనకు ఘనంగా స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో సీఐ ప్రమోద్‌రావు, మహిళా పోలీస్‌స్టేషన్ సీఐ నరేష్‌కుమార్, ఎస్సైలు పాల్గొన్నారు.

విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు

మంచిర్యాలక్రైం: పోలీసులు విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే శాఖాపరమైన చర్యలు తప్పవని రామగుండం పోలీసు కమిషనర్ అంబర్ కిషోర్ ఝూ హెచ్చరించారు. బుధవారం రామగుండం కమిషనరేట్‌లోని సమావేశ మందిరంలో మంచిర్యాల, పెద్దపల్లి జిల్లాల పెట్రోకార్, బ్లూకోల్ట్స్ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అధికారులందరూ సమన్వయంతో ఒక బృందంగా పని చేసినప్పుడే మంచి ఫలితాలు సాధిస్తామని, ఫిట్‌నెస్ కలిగి క్రమశిక్షణతో ఎదుటివారికి ఆదర్శంగా ఉండాలని అన్నారు. నేరాల నియంత్రణలో బ్లూకోల్ట్స్, పెట్రోకార్ అధికారుల పాత్ర కీలకమని, 24గంటలు అప్రమత్తంగా ఉండాలని, డయల్ 100కు ఫోన్ రాగానే నిర్ణీత సమయంలో సంఘటన స్థలానికి చేరుకుని అధికారులకు సమాచారం అందించాలని సూచించారు. ఎస్‌బీ ఏసీపీ రాఘవేంద్రరావు, ఏఆర్‌ఏసీపీ ప్రతాప్, సీఐలు, ఎస్సైలు, వర్టికల్ ఇన్‌చార్జిలు పాల్గొన్నారు.

కరెంటు లేని బడికి రూ.23వేలు బిల్లు


కాజిపల్లిలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల

భీమారం: ఇది మండలంలోని కాజిపల్లి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల. గ్రామ శివారులో భవనం ఉండడంతో దాదాపు పాతికేళ్లుగా కరెంటు కనెక్షన్‌కు నోచుకోలేదు. గతంలో పలుమార్లు ఉమ్మడి జైపూర్ మండలంలో మండల సర్వసభ్య సమావేశాల్లో అప్పటి ప్రజాప్రతినిధులు విద్యుత్ కనెక్షన్ ఇవ్వాలని ప్రస్తావించారు. గ్రామ శివారులో ఉండడంతో కనెక్షన్ ఇచ్చే అవకాశం లేదని అప్పట్లోనే అధికారులు స్పష్టం చేశారు. ఏం జరిగిందో గానీ కరెంటు కనెక్షన్ ఇవ్వకున్నా, మీటరు లేకున్నా విద్యుత్ అధికారులు సర్వీసు నంబరు 00238 కేటాయించారు. ఇటీవల పాఠశాల ఉపాధ్యాయులు, స్థానిక నాయకులు భీమారంలోని విద్యుత్ శాఖ కార్యాలయానికి వెళ్లి విద్యుత్ కనెక్షన్ ఇవ్వాలని కోరగా.. ఇప్పటికే రూ.23 వేలు బిల్లు బకాయి ఉందని అధికారులు తేల్చిచెప్పారు. కరెంటు కనెక్షన్ లేదని, బిల్లు ఎలా వచ్చిందంటూ ప్రశ్నించగా.. కనెక్షన్ లేదని గ్రామ పంచాయతీ నుంచి సర్టిఫికెట్ తేవాలని ఏఈ శంకర్ సలహా ఇచ్చారు. ఈ విషయమై ఏఈని సంప్రదించగా.. పాఠశాలకు విద్యుత్ మీటరు ఉండి, విద్యుత్ వినియోగించుకున్నట్లు ఉందని తెలిపారు. బకాయి విషయమై ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తానని పేర్కొన్నారు.

రోగులకు మెరుగైన వైద్య సేవలందించాలి


సిబ్బందితో మాట్లాడుతున్న కలెక్టర్ కుమార్ దీపక్

బెల్లంపల్లి: ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ సూచించారు. బుధవారం బెల్లంపల్లిలోని ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆసుపత్రిలోని అన్ని వార్డులు, మందుల నిల్వ, ల్యాబ్, రిజిష్టర్లు, ఆసుపత్రి పరిసరాలను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఆసుపత్రి వార్డులు, పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని తెలిపారు. ఆస్పత్రికి వచ్చే రోగులతో మర్యాదపూర్వకంగా వ్యవహరించాలని తెలిపారు. వేసవి కాలంలో వడదెబ్బ తగలకుండా ప్రజలకు ముందస్తు జాగ్రత్తలు సూచించాలని పేర్కొన్నారు. వైద్యులు, సిబ్బంది సమయపాలన పాటించాలని సూచించారు. అనంతరం ఆర్డీవో కార్యాలయంలో రికార్డులు పరిశీలించారు. ఐటీఐ ఏర్పాటు కోసం పలు చోట్ల స్థల పరిశీలన చేశారు. బెల్లంపల్లి ఆర్డీవో హరికృష్ణ, తహసీల్దార్ జ్యోత్స్న, సిబ్బంది పాల్గొన్నారు.

ఇంటర్ పరీక్షకు 97శాతం హాజరు

మంచిర్యాలఅర్బన్: జిల్లాలో నిర్వహించిన ఇంటర్మీడియెట్ ద్వితీయ సంవత్సరం పరీక్షకు బుధవారం 97శాతం విద్యార్థులు హాజరయ్యారు. 23 పరీక్ష కేంద్రాల్లో 6,699 మందికి గాను 6123 మంది హాజరు కాగా 176 మంది గైర్హాజరయ్యారు. ఇందులో జనరల్ విద్యార్థులు 5512 మందికి 5,362 హాజరు కాగా 150 మంది రాలేదు. ఒకేషనల్ విద్యార్థులు 787మందికి 761 మంది హాజరు కాగా 26మంది గైర్హాజరయ్యారు. పరీక్ష కేంద్రాలను డీఐఈవో అంజయ్య పరిశీలించారు.

సహజ హోలీ.. సంతోషాల కేళి

- ఇప్పటికీ మోదుగుపూల రంగులే వాడుతున్న ఆదివాసీలు
- రసాయనాలతో ముప్పు

అడవులను నమ్ముకుని జీవనం సాగిస్తున్న ఆదివాసీలు జరుపుకునే ప్రతీ పండుగకు ప్రత్యేక చరిత్ర ఉంటుంది. అందరిలా కాకుండా వారంతా ప్రత్యేకంగా వైవిధ్యంగా పండుగలు జరుపుకుంటారు. శుక్రవారం హోలీ పండుగను కూడా ప్రత్యేకంగా జరుపుకునేందుకు ఇప్పటి నుంచే సిద్ధమవుతున్నారు. హోలీ వేడుకల్లో ప్రత్యేకంగా మోదుగుపూలతో తయారు చేసిన రంగులతో రంగోలి ఆడడం ఆనవాయితీగా వస్తోంది. రేపు శుక్రవారం సంబరాలకు ఉమ్మడి జిల్లావాసులు సిద్ధమయ్యారు. వేడుకల్లో ఆరోగ్యానికి హాని కలిగించే రసాయన పూరిత రంగులు ఆరోగ్యానికి హానికరమని, సహజ సిద్ధమైన రంగులు వాడడం శ్రేయస్కరమని వైద్య నిపుణులు సూచిస్తున్నారు.

– కెరమెరి/నిర్మల్‌చైన్‌గేట్/నిర్మల్‌ఖిల్లా


పూలతో రంగులు తయారు చేస్తున్న ఆదివాసీలు

అనాదిగా వస్తున్న ఆచారం


ఆదివాసీలు ఆచార వ్యవహారాలకు పెద్దపీట వేస్తున్నారు. అనేక పండుగలను వైవిధ్యంగా జరుపుకుంటున్నప్పటికి ఈ హోలి పండుగకు ప్రత్యేక ప్రాధాన్యత ఉంది. గతంలో బయట మార్కెట్లో ఎక్కడ కూడా అనుకున్న విధంగా రంగులు లభించేవి కాదు. అందుకు వీరంతా ప్రకృతి ప్రసాదించిన మోదుగు పూలనే రంగులకు వాడుకునేవారు. ఈ పూలు మార్చి నెలలో మాత్రమే ఉంటాయి.

రంగుల తయారీ ఇలా..

హోలీకి ఒక రోజు ముందు మోదుగ పూలను తీసుకువచ్చి నీటిలో నానబెడతారు. తెల్లవారు జామున రోట్లో వేసి రోకలితో దంచుతారు. లేదా గ్రైండింగ్ చేస్తారు. ఆతర్వాత నీటిలో కలిపి హోలీ ఆడుతారు.

సహజ రంగులైతే మేలు..

సహజ సిద్ధమైన రంగులు వాడితే ఆరోగ్యానికి ఎంతో మేలు జరుగుతుంది. పండ్లు, కూరగాయలు, ఆకుకూరలతో వివిధ రకాలైన రంగులను తయారు చేసుకోవచ్చు. వీటితో ఎలాంటి హాని జరగదు. దానిమ్మ, టమాటతో ఎరుపు రంగు, మోదుగుపూలు, క్యారెట్‌తో ఆరెంజ్ రంగు, బీట్‌రూట్ ఊదారంగు, ఆకు కూరలతో ఆకుపచ్చ రంగు, పసుపు కొమ్ములతో పసుపు రంగు ఇలా సహజ సిద్ధమైన రంగులను తయారు చేసుకోవచ్చు.


పూలతో నిండుగా ఉన్న మోదుగు చెట్టు

పాటించాల్సిన జాగ్రత్తలు

- చర్మానికి రంగులు పట్టుకోకుండా ముందస్తుగా ఆవాల నూనె, జెల్లీని రాసుకోవాలి.
- కళ్లకు అద్దాలు పెట్టుకుంటే రంగునీళ్లు కళ్లలో పడకుండా ఉంటాయి.
- హోలీ ఆడిన వెంటనే చేతులను శుభ్రంగా కడుక్కోవాలి. లేదంటే చేతి గోర్ల నుంచి రంగులు శరీరంలోకి ప్రవేశించే అవకాశం ఉంది.

రసాయన రంగులతో ప్రమాదం..

- రంగుల్లో పాదరసం, సిలికా, మైకా, సీసం, వంటి వివిధ రకాల రసాయనాలు కలుపుతారు. ఇవి చర్మానికి, కళ్లకు, శ్వాస సంబంధిత సమస్యలకు కారణమవుతాయని వైద్యులు చెబుతున్నారు.
- రంగుల పొడి చల్లినప్పుడు అవి గాలిలో కలిసిపోయి నోటిలోకి, శ్వాసనాళాల్లోకి వెళ్లి ఆరోగ్య సమస్యలు ఏర్పడుతాయి. గాలి పీల్చినప్పుడు ఈ రంగులు ఊపిరితిత్తుల్లోకి వెళ్లి అస్తమా, ఎలర్జీ ఏర్పడే అవకాశం ఉంటుంది.
- రసాయన రంగులతో శరీరం దురద, మంట, నొప్పి కలుగుతుంది. కళ్లలో రంగులు పడితే కంటి పొరలు దెబ్బతినే అవకాశం ఉంది.
- రంగులు నోట్లోకి వెళ్తే వాంతులు, విరోచనాలు అవుతాయి. కడుపునొప్పి వస్తుంది.
- నలుపురంగులో లెడ్ ఆక్సైడ్‌తో మూత్రపిండాల వైఫల్యాలకు దారితీస్తుంది.
- కృత్రిమ ఆకుపచ్చ రంగుతో కాపర్ సల్ఫేట్ కంటి దురద, వాపు వైఫల్యాలకు దారితీస్తుంది.
- వెండి రంగు అల్యూమినియం బ్రోమైడ్ క్యాన్సర్ కారకం.
- నీలి రంగు చర్మ సంబంధ వ్యాధులు, మెర్క్యూరీ సల్ఫేట్ (ఎరువు) క్యాన్సర్‌కు కారణమవుతుంది.
- పౌడర్లు, గులాల్, లెడ్, బ్రోమియం, నికెల్, మెర్క్యూరీ, కాపర్, జింక్, వినిడికి లోపం, ఎలర్జీ, ఆయాసం మొదలగు దుష్ఫలితాలకు దారితీస్తాయి.

తాతమ్మ నేర్పిన మార్గంలోనే...



నిర్మల్‌ఖిల్లా: మోదుగ పూలు ఆరోగ్యరీత్యా పలు సుగుణాలు కలిగి ఉన్నాయి. నేను చిన్నప్పుడు దుకాణాల్లో కొనుగోలు చేసిన రంగులను వినియోగించే సందర్భంలో మా తాతమ్మ వాటికి బదులుగా మోదుగు పూలను తెచ్చి నానబెట్టి ఉడికించిన తర్వాత చేసిన కాషాయవర్ణపు సహజ సిద్ధ రంగులను వినియోగించమని ప్రోత్సహించేది. అలా నాకు దీని తయారీ అలవాటైంది. ఇప్పటికీ నా పిల్లలకు ఇదే సంప్రదాయాన్ని నేర్పిస్తూ కొనసాగిస్తున్నా.

– నల్ల మన్మోహన్‌రెడ్డి, సేంద్రియ రైతు, చించోలి(బి), నిర్మల్

మార్పుకోసం కృషి



రసాయన రంగులు మానుకోవాలి. ప్రకృతిలో దొరికే పూలు, ఆకులతో తయారయ్యే రంగులను వాడి ఆరోగ్యాన్ని కాపాడుకోవాలి. తద్వారా పర్యావరణాన్ని కాపాడినట్టే. ఇదే విషయం మా పాఠశాల విద్యార్థులకు అర్థమయ్యేలా చెబుతున్నా. వారితో స్వయంగా సహజసిద్ధమైన రంగులు తయారు చేసే విధానం నేర్పిస్తున్నా.

– వీఎస్ శ్రీనివాస్, ఎంపీపీఎస్ వెంకటాపూర్, మామడ, నిర్మల్

రసాయన రంగులతో ముప్పు



రసాయన రంగులతో ఆరోగ్య సమస్యలు వస్తాయి. శరీరంలో మంట, దురద వస్తాయి. రంగుల నుంచి వచ్చే పొగ పీల్చుకోవడం ద్వారా ఊపిరితిత్తుల సమస్యలతో పాటు శ్వాస సంబంధిత వ్యాధుల ముప్పు ఉంటుంది.

– డాక్టర్ రత్నాకర్, ఫిజీషియన్, నిర్మల్

కృత్రిమ రసాయనాలతో ప్రమాదం



రంగులు ఏవైనా కళ్లల్లో పడకుండా జాగ్రత్త పడాలి. హానికర రసాయనాలతో కూడిన రంగులతో రెటినా దెబ్బతినే ప్రమాదం ఉంది. అల్సర్లు, పుండ్లు ఏర్పడి శాశ్వతంగా కంటి చూపు దెబ్బతినే అవకాశం ఉంది.

– సురేశ్, కంటి వైద్యనిపుణుడు, నిర్మల్

తాతాలకాలం నుంచి..



మోదుగ పూలతో రంగులు తయారు చేసుకుని చల్లుకోవడం తాత ముత్తాతల కాలం నుంచి వస్తున్న ఆచారం. ఇప్పటికీ మేము ఇదే ఆచారాన్ని పాటిస్తున్నాం. ఎన్ని రంగులు బయట నుంచి తీసుకవచ్చినా మోదుగు పూలతో తయారు చేసిన రంగులతో సరిపోవు.

– సెడ్మకి దుర్పతబాయి, మాజీ జెడ్పీటీసీ

కుడుకలు ఇస్తే లెక్క

- నేడు పులారా.. రేపు దురాడి
- సంప్రదాయబద్ధంగా కాముడి దహనం
- డోలు, బాజాలతో తరలివెళ్లనున్న ఆదివాసీలు
- కామున్ని దహనం చేసిన చోటే రాత్రంతా బస

కెరమెరి/ఇంద్రవెల్లి: ఆదివాసీల సంస్కృతి, సంప్రదాయం ప్రకారం హోలీకి ముందురోజు గ్రామ పటేల్, దేవారికి గ్రామస్తులంతా కుడుకలు ఇస్తారు. ఇలా కుడుకలు ఇచ్చిన వారే గ్రామస్తులుగా పరిగణించబడుతారు. గ్రామంలో ఉండి కూడా కుడుకలు ఇవ్వని వారికి గ్రామంతో సంబంధం లేదని గుర్తిస్తారు. ఈ కార్యమంతా కాముని దహనం రోజు జరుగుతుంది. గురువారం సాయంత్రం జిల్లాలోని ఆదివాసీ గ్రామాల్లో ఈ ఆచారం కొనసాగుతుంది. కుడుకలతో పాటు చక్కెర బిళ్లలు గ్రామ పటేల్, దేవారికి అందజేస్తారు. అనంతరం వాటిని లెక్కిస్తారు. వాటి ప్రకారం గ్రామంలో ఎన్ని కుటుంబాలు ఉన్నాయి, వాటికి సమానంగా కుడుకలు, పేర్లు వచ్చాయో లేదో పరిశీలిస్తారు.


కుడుకలు అందిస్తున్న గ్రామస్తులు (ఫైల్)

పులారా అలంకరణ

వెదురు కర్రలతో రెండు పులారాలను తయారు చేస్తారు. వాటికి ఐదుచోట్ల కుడుకలు, గారెలు, గోగుపూలు, చక్కెర బిళ్లలు, వంకాయ అమరుస్తారు. అనంతరం గ్రామ పొలిమేర వరకు డోలు, సన్నాయిలతో తరలివెళ్లి కాముని దహనం చేస్తారు. అనంతరం రెండు వెదుర్లకు వృద్ధుడు, వృద్ధురాలు అని నామం పెట్టి ఆ పులారాలను కడుతారు. కిందిభాగంలో మంట అంటిస్తారు. ఆ తర్వాత ఆ మంట పై నుంచి వరుసగా కొందరు దూకుతారు. అనంతరం గ్రామంలోని ప్రతీ కుటుంబం నుంచి రొట్టెలు, పప్పులు తీసుకువచ్చి కాముని దహనం వద్ద ప్రత్యేక పూజలు చేస్తారు. ఆతర్వాత సహపంక్తి భోజనం చేస్తారు. కాముడిని దహనం చేసిన చోటే రాత్రంతా బస చేస్తారు.

కేరింతలకూ..చరిత్ర!

హోలీ రోజు ప్రతీ గ్రామంలో రంగులు చల్లుకుంటారు. కానీ ఆదివాసీ గిరిజనుల మాత్రం అందుకు కొంత భిన్నంగా ఉంటారు. రంగులు చల్లుకోవడంతో పాటుగా డోలు వాయిస్తూ.. జాజిరి ..జాజిరి.. బోబోబోబో.. అంటూ కేరింతలు పెడతారు. రావణాసురునిపై శ్రీరాముడు బాణం విసిరినప్పుడు అది తప్పిపోవడంతో రావణ సైన్యం అలాగే కేరింతలు పెట్టిందని, రావణుడు మరణించాక ఆ ఆనందంలో రాముని సైన్యం ఇలా తిరిగి కేరింతలు పెడుతూ ఉత్సాహంగా జరుపుకుంటారు. దానికి ప్రతీకగా ఈ కేరింతలు ఇప్పటికీ కొనసాగుతున్నాయని పటేళ్లు చెబుతున్నారు.

బూడిదకు అత్యంత ప్రాధాన్యం

కాముడి దహనం తర్వాత అట్టి బూడిదను ఆదివాసీ సంప్రదాయం ప్రకారం ఇళ్ల ముఖద్వారాల వద్ద గీత వేస్తారు. అలా వేస్తే ఎలాంటి దుష్టశక్తులు తమ ఇళ్లకు రావని ఆదివాసీల నమ్మకం. అంతేకాకుండా దండారీ ఉత్సవాల్లో కాముడి బూడిదకు అత్యంత ప్రాధాన్యం ఉంటుంది. గుస్సాడీ వేషధారణలో ఈ బూడిదను ఉపయోగిస్తారు.

అన్ని పండుగలకు భిన్నంగా..



అన్ని పండుగలకంటే హోలి, దురాడి చాలా భిన్నంగా జరుపుకుంటాం. అంతా ఒక్కటై కాముని పున్నమిని జరుపుకుంటాం. కుడుకల ఆచారం చాలా ముఖ్యం. గ్రామ పటేల్‌కు కుడుకలు ఇస్తేనే ఆ గ్రామంలో ఉన్నట్టు. లేదంటే లేనట్టే. కాముని దహనం తర్వాత అక్కడే బస చేస్తాం.

– దంబీరావు, గ్రామ పటేల్, చిన్న సాకడ

తాత, ముత్తాతల నుంచి..



మాతాత ముత్తాతల నుంచి వస్తున్న ఆచారమిది. అన్ని గ్రామాల్లోని ఆదివాసీలు ఈ పండుగలకు అతీతులే. ప్రతిఒక్కరూ ఈ ఆచారాన్ని పాటించాల్సించే. కానీ హోలి, దురాడి కార్యక్రమాల్లో మహిళలు అంతగా పాల్గొనరు. ఎక్కువగా ఈ కార్యక్రమాలను పురుషులు మాత్రమే జరుపుకుంటారు.

– రాధాబాయి, చౌపన్‌గూడ

పూర్వీకుల నుంచి..



ఉట్నూర్‌రూరల్/ఇంద్రవెల్లి: మా చిన్నతనం నుంచి హోలి పండుగ వచ్చిందంటే ప్రకృతి ప్రసాదించిన మోదుగ పూలతోనే రంగులు ఆడుతాం.. తెల్లవారు జామున నిద్రలేచి అడవికి వెళ్లి పూలు తెచ్చి రంగులు తయారు చేస్తాం. మా పూర్వీకుల నుంచి వస్తున్న ఆచారం.

– పెందూర్ చందు, సమాక, ఇంద్రవెల్లి

రాబోయే తరానికి..



ఉట్నూర్‌రూరల్/ఇంద్రవెల్లి: మార్కెట్లో లభించే రంగులు వాడితే అనేక రోగాలు వస్తాయని, అవి వాడవద్దని, అడవిలో లభించే మోదుగు పూలతో తయారు చేసిన రంగులనే వాడాలని మాపిల్లలకు నేర్పిస్తున్నాం. రాబోయే తరానికి కూడా నేర్పిస్తున్నాం.

– భీంరావు, సమాక, ఇంద్రవెల్లి

క్లుప్తంగా

లారీలను అడ్డుకున్న యువకులపై కేసు

ఆదిలాబాద్‌టౌన్: మహారాష్ట్ర నుంచి హైదరాబాద్ వెళ్తున్న లారీలను అక్రమంగా అడ్డగించి డ్రైవర్లను వేధింపులకు గురిచేసిన యువకులపై కేసు నమోదు చేసినట్లు జైనథ్ ఎస్సై పురుషోత్తం తెలిపారు. ఆదిలాబాద్ పట్టణానికి చెందిన పద్మవార్ రాకేష్, సచిన్, కార్తీక్, సాత్వీక్ మంగళవారం రాత్రి జైనథ్ మండలం భోరజ్ చెక్‌పోస్టు వద్ద లారీలు ఆపుతుండగా విషయం తెలుసుకున్న జైనథ్ పోలీసులు అక్కడికి వెళ్లారు. ఎలాంటి అధికారం లేకుండా ఎద్దుల లారీలను అక్రమంగా అడ్డుకుని డ్రైవర్లు సందీప్ గోకులే, షేక్ సాహిల్‌ను బెదిరిస్తుండడంతో బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లుగా తెలిపారు.

మద్యం పట్టివేత

వాంకిడి: మహారాష్ట్ర నుంచి అక్రమంగా తరలిస్తున్న మద్యం బాటిళ్లను బుధవారం పట్టుకున్నట్లు ఎక్సైజ్‌శాఖ ఇన్‌చార్జి సీఐ రమేశ్ తెలిపారు. వాంకిడి మండలంలోని గోయేగాం గ్రామ సమీపంలో వాహనాల తనిఖీలు నిర్వహిస్తుండగా మహారాష్ట్రలోని చంద్రపూర్ నుంచి గడ్చిరోలి జిల్లాలోని సిరోంచకు వెళ్తున్న బస్సును తనిఖీ చేయగా 90 ఎంఎల్ దేశీదారు బాటిళ్లు 1010, 2 లీటర్ల రాయల్‌స్టాగ్ బాటిళ్లు 11, 2 లీటర్ల ఐబీ బాటిల్ 1, ఆఫీసర్స్ చాయిస్ బాటిల్ 1 లభ్యమయ్యాయి. వాటి విలువ రూ.58,970 ఉంటుందన్నారు. మద్యం స్వాధీనం చేసుకుని తరలిస్తున్న తిరుమల బానయ్య, జ్యోతి దినేష్ కుంబారే, సుమలత, కిష్టయ్యపై కేసు నమోదు చేసినట్లు ఆయన పేర్కొన్నారు. తనిఖీల్లో ఎక్సైజ్‌శాఖ హెడ్‌కానిస్టేబుల్ లక్ష్మణ్, కానిస్టేబుళ్లు ధన్‌రాజ్, రజిత పాల్గొన్నారు.

హెచ్‌ఎం అరెస్ట్

భీమిని: మండలంలోని జగ్గయ్యపేట ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రేగుచెట్టు రమేశ్‌ను బుధవారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై విజయ్‌కుమార్ తెలిపారు. గత నెల 28న పాఠశాలలో ఐదోతరగతి చదువుతున్న బాలికతో అసభ్యంగా ప్రవర్తించినందుకు పోక్సో కేసు నమోదైంది. దీంతో విచారణ చేపట్టిన పోలీసులు బుధవారం అరెస్ట్ చేసి బెల్లంపల్లి కోర్టులో మెజిస్ట్రేట్ ఎదుట హాజరు పర్చినట్లు ఆయన పేర్కొన్నారు.

బైక్‌లు ఢీకొని ఒకరికి గాయాలు


ఎల్లయ్యను ఆస్పత్రికి తరలిస్తున్న స్థానికులు

కడెం: మండల కేంద్రంలోని ఎస్‌బీఐ సమీపంలో బుధవారం రెండు బైక్‌లు ఢీకొన్న ఘటనలో ఒకరికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల మేరకు దస్తురాబాద్ మండలం మున్యాల్‌కు చెందిన ఇద్దరు యువకులు ఇంటర్ పరీక్షలు రాసేందుకు ద్విచక్ర వాహనంపై కడెం వస్తుండగా ఎస్‌బీఐ బ్యాంక్ వైపు నుంచి బైక్‌పై వస్తున్న ధర్మాజీపేట్ గ్రామానికి ఎల్లయ్య బైక్‌ను ఢీకొట్టారు. ఘటనలో ఎల్లయ్య కాలుకు తీవ్రగాయాలయ్యాయి. గమనించిన స్థానికులు 108కు సమాచారం అందించడంతో ఖానాపూర్ ఆస్పత్రికి తరలించారు.

బావిలోపడి యువకుడు మృతి

కౌటాల: ప్రమాదవశాత్తు బావిలోపడి యువకుడు మృతి చెందిన సంఘటన మండలంలో చోటు చేసుకుంది. మొగడ్‌దగడ్‌కు చెందిన ఉర్వత్ దౌలత్ (26) కొంతకాలంగా మద్యానికి బానిసై మతిస్థిమితం కోల్పోయాడు. మంగళవారం మద్యం మత్తులో ఇంట్లో నుంచి బయటకు వెళ్లాడు. బుధవారం ఉదయం గ్రామ శివారులోని బావిలో మృతదేహం కనిపించడంతో పోలీసులకు సమాచారం అందించారు. మృతుని తల్లి నిర్మలబాయి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

ఇద్దరిపై వరకట్న వేధింపుల కేసు

మంచిర్యాలక్రైం: పట్టణంలోని హమాలివాడకు చెందిన ముత్యాల (చిలువేరు) స్వాతికి కుమురంభీం జిల్లా కాగజ్‌నగర్‌కు చెందిన ముత్యాల రాంప్రసాద్‌తో 2011 మార్చి 24న వివాహం జరిగింది. రాంప్రసాద్ విద్యుత్ శాఖలో ఏఈగా పనిచేస్తున్నాడు. వివాహ సమయంలో రూ.15 లక్షల నగదు, 10 తులాల బంగారు ఆభరణాలు, సుమారు రెండు లక్షల విలువ గల సామగ్రి అందజేశారు. దంపతులకు పాప, బాబు జన్మించారు. అప్పటి నుంచి ఇద్దరి మధ్య తరచూ గొడవలు జరుగుతున్నాయి. గతంలో పోలీస్ స్టేషన్ వరకు రావడంతో కౌన్సిలింగ్ ఇచ్చి పంపించారు. అయినా రాంప్రసాద్, అతని సోదరి సరోజ అదనపు కట్నం కావాలని వేధించారు. అంతేకాకుండా రాంప్రసాద్ పలువురు మహిళలతో వివాహేతర సంబంధం పెట్టుకుని స్వాతిని తీవ్రంగా కొట్టాడు. స్వాతి ఇచ్చిన ఫిర్యాదు మేరకు రాంప్రసాద్, సరోజపై అదనపు కట్నం, వేధింపుల కేసు నమోదు చేసినట్లు సీఐ నరేష్ కుమార్ తెలిపారు.

కొలువుల సాధనలో మేటి అశోక్

- చదివిన కళాశాలలోనే జూనియర్ లెక్చరర్‌గా ఉద్యోగం

కాసిపేట: కష్టపడి చదివి నాలుగు ఉద్యోగాలు సాధించడంతో పాటు తాను విద్యను అభ్యసించిన ప్రభుత్వ జూనియర్ కళాశాలలోనే జేఎల్‌గా ఉద్యోగం సాధించాడు జిల్లాకు చెందిన పెద్ది అశోక్. మంచిర్యాల జిల్లా కాసిపేట మండలంలోని కొండపూర్‌కు చెందిన రిటైర్డ్ సింగరేణి కార్మికుడు పెద్ది పెంటయ్య, మధునమ్మ దంపతుల కుమారుడు అశోక్ 2012లో ఫారెస్టు బంగ్లా వాచర్ పరీక్షలో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో మొదటి ర్యాంకుతో ఉద్యోగం సాధించాడు. కొలువు చేస్తూనే 2016లో ఫారెస్టు బీట్ ఆఫీసర్ ఫలితాల్లో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో నాలుగో ర్యాంకు సాధించాడు. 2024లో జరిగిన గురుకుల డిగ్రీ లెక్చరర్ ఫలితాల్లో రాష్ట్రంలో రెండో ర్యాంకు సాధించి నిర్మల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో లెక్చరర్‌గా పనిచేస్తున్నాడు. ఇటీవల వెలువడిన ప్రభుత్వ జూనియర్ లెక్చరర్ పోస్టుల ఫలితాల్లో హిస్టరి సబ్జెక్టులో రాష్ట్రంలో రెండో ర్యాంకు సాధించి బుధవారం హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా నియామకపత్రం అందుకున్నాడు. తాను ఇంటర్ చదివిన కాసిపేట మండలంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జేఎల్‌గా పోస్టింగ్ ఆర్డర్ తీసుకున్నాడు. 1 నుంచి పదోతరగతి వరకు ప్రైవేట్ పాఠశాలల్లో చదివిన అశోక్ ఇంటర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల కాసిపేటలో సీఈసీ, డిగ్రీ ప్రభుత్వ జూనియర్ కళాశాల మంచిర్యాలలో, పీజీ ఉస్మానియా యూనివర్సిటి ఆర్ట్స్ కాలేజీ హైదరాబాద్‌లో పూర్తి చేశాడు. కాగా పీజీ ఎంట్రెన్స్‌లో సైతం మూడవ ర్యాంకు సాధించాడు. తల్లిదండ్రుల ప్రోత్సాహంతో తాను ఈ విజయం సాధించినట్లు పేర్కొన్నాడు. ఉద్యోగాల సాధనలో పట్టుదలతో ముందుకు వెళ్లడంతోనే విజయం సాధించినట్లు తెలిపాడు. భవిష్యత్‌లో గ్రూప్1 సాధించడం లక్ష్యంగా ముందుకెళ్తానని, అందుకు ప్రిపరేషన్ ప్రారంభించనున్నట్లు అశోక్ పేర్కొన్నాడు.



నియామకపత్రంతో అశోక్

డీసీపీ ఔదార్యం


గాయపడిన మహిళను ఆటోలో ఎక్కిస్తున్న డీసీపీ

మంచిర్యాలరూరల్(హాజీపూర్): హాజీపూర్ మండలం వేంపల్లిలో బుధవారం రాత్రి జరిగిన ప్రమాద ఘటనలో డీసీపీ స్పందించిన తీరుపై పలువురు హర్షం వ్యక్తం చేస్తున్నారు. మంచిర్యాల డీసీపీ ఏ.భాస్కర్ లక్సెట్టిపేట నుంచి మంచిర్యాలకు వెళ్తుండగా వేంపల్లి వద్ద గుర్తు తెలియని వాహనం ఢీకొని మహిళకు తీవ్ర గాయాలయ్యాయి. గమనించిన డీసీపీ వెంటనే తన వాహనాన్ని ఆపి ఓ ఆటోలో మహిళను ఎక్కించి మంచిర్యాల ప్రభుత్వ ఆస్పత్రికి పంపించారు. మానవతా దృక్పథం చాటిన డీసీపీని పలువురు అభినందిస్తున్నారు.

ఎన్‌సీడబ్ల్యూసీ ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జిగా రమేశ్


శెడంషెట్టి రమేశ్

భీమారం: నేషనల్ కాంగ్రెస్ వర్కర్స్ కమిటీ (ఎన్‌సీడబ్ల్యూసీ) ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జిగా మంచిర్యాల జిల్లా భీమారం మండలంలోని కాజిపల్లి గ్రామానికి చెందిన శెడంషెట్టి రమేశ్‌ను నియమిస్తూ బుధవారం కమిటీ ప్రెసిడెంట్ గుర్విందర్ మెహతా ఉత్తర్వులు జారీ చేశారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా కాంగ్రెస్ పార్టీ బలోపేతం కోసం తనవంతు కృషి చేస్తానని ఈ సందర్భంగా రమేశ్ తెలిపారు.


ఉచిత శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

ఆదిలాబాద్‌రూరల్/మంచిర్యాలటౌన్: ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో డిగ్రీ పాసైన బీసీ అభ్యర్థులకు బ్యాంకింగ్ అండ్ ఫైనాన్స్‌లో ఉచిత శిక్షణ, ఉద్యోగ కల్పనకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా బీసీ అభివృద్ధి శాఖ అధికారి రాజలింగు, బీసీ స్టడీ సర్కిల్ సెంటర్ డైరెక్టర్ ప్రవీణ్ కుమార్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. హైదరాబాద్ స్కూల్ ఆఫ్ బ్యాంకింగ్ అండ్ ఫైనాన్స్ ట్రైనింగ్ ఇనిస్టిట్యూట్ ద్వారా నెలరోజుల పాటు శిక్షణ ఇవ్వనున్నట్లు వారు పేర్కొన్నారు. శిక్షణ అనంతరం ప్రైవేట్ బ్యాంకుల్లో ప్లేస్‌మెంట్ కల్పిస్తారన్నారు. డిగ్రీ పూర్తిచేసి 26 ఏళ్లలోపు ఉన్న అభ్యర్థులు ఈ నెల 15 నుంచి ఏప్రిల్ 8 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఏప్రిల్ 12న స్క్రీనింగ్ టెస్టు నిర్వహించి అందులో సాధించిన మార్కుల ఆధారంగా 30 మందిని ఎంపిక చేయనున్నట్లు తెలిపారు. వివరాలకు 08732–221280 నంబరులో సంప్రదించాలని సూచించారు.

కలిసికట్టుగా ఆడితేనే విజయం

- హాకీ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు బాలూరి గోవర్ధన్‌రెడ్డి

ఆదిలాబాద్: క్రీడాకారులు కలిసికట్టుగా పట్టుదలతో ఆడితేనే విజయం సాధ్యమని హాకీ అసోసియేషన్ ఆదిలాబాద్ జిల్లా అధ్యక్షుడు బాలూరి గోవర్ధన్ రెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలోని ఇందిరా ప్రియదర్శిని స్టేడియంలో మేజర్ ధ్యాన్‌చంద్ హాకీ ఫీల్డ్‌లో ఏర్పాటు చేసిన హాకీ ఉమ్మడి జిల్లాస్థాయి సీనియర్ పురుషుల ఎంపిక పోటీలను బుధవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రణాళికతో ఆడితే విజయం సులభం అవుతుందన్నారు. ప్రతి ఒక్కరూ తమలోని ప్రతిభను కనబరుస్తూ అవకాశాలను అందిపుచ్చుకోవాలన్నారు. నిరంతరం సాధన చేస్తూ క్రీడా నైపుణ్యాలను పెంచుకోవాలన్నారు. అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి పార్థసారథి మాట్లాడుతూ ఎంపికైన క్రీడాకారులు ఈనెల 16 నుంచి 18 వరకు కరీంనగర్ జిల్లా హుజురాబాద్‌లో జరిగే 8వ రాష్ట్రస్థాయి సీనియర్ పురుషుల హాకీ టోర్నమెంట్లో ప్రాతినిధ్యం వహిస్తారన్నారు. వారికి మేనేజర్‌గా డేవిడ్ రాజు, శిక్షకునిగా జే.రవీందర్ వ్యవహరిస్తారన్నారు. ఈ కార్యక్రమంలో ఖేలో ఇండియా కోచ్ శ్రీనివాస్, సీనియర్ ప్లేయర్ అతుల్, పాల్గొన్నారు.


రాష్ట్రస్థాయికి ఎంపికైన క్రీడాకారులు

ఎంపికైన క్రీడాకారులు వీరే..

కొడప జంగు, వెట్టి జాకు, వెట్టి భీమ్‌రావ్, పవార్ అమర్నాథ్, విజయ్‌రెడ్డి, సుదర్శన్, హాడ్సే గజానంద్, చౌహాన్ వంశీ, మెస్రం అజయ్, శేఖర్, సంగం గౌతమ్, రామ్‌కుమార్, కిరణ్ కుమార్, పెద్దివార్ శ్రీనివాస్, అశోక్, షేక్ మహమ్మద్, కొడప ప్రదీప్, ఆత్రం జగ్జీవన్ ఉన్నారు.

గంజాయి తరలిస్తున్న ఒకరు అరెస్టు

ఆదిలాబాద్‌రూరల్: గంజాయి తరలిస్తున్న ఒకరిని అరెస్టు చేసినట్లు ఎస్సై గౌతమ్ తెలిపారు. మావల పోలీస్ స్టేషన్ పరిధిలోని పిట్టల్‌వాడకు చెందిన వెంకట్ బుధవారం దస్నాపూర్ కాలనీ నుంచి పిట్టల్‌వాడకు స్కూటీపై గంజాయి తరలిస్తుండగా తమకు అందిన సమాచారం మేరకు అతన్ని తనిఖీ చేయగా 176 గ్రాముల గంజాయి లభ్యమైనట్లు పేర్కొన్నారు. గంజాయి విలువ రూ.4,400 ఉంటుందన్నారు. గంజాయితో పాటు స్కూటీ, సెల్‌ఫోన్ స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.